www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 16 మార్చి 2024

5

ఏలూరు

నేడు జాతీయ లోక్‌అదాలత్

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తమకుమార్ ఆధ్వర్యంలో ఈ నెల 16న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ చెప్పారు. శుక్రవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా 32 బెంచీలను ఏర్పాటు చేశామని, ఏలూరులో ఎనిమిది బెంచీలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ అదాలత్‌లో పరిష్కారం నిమిత్తం 8152 కేసులను గుర్తించారని, కక్షిదారులు నేరుగా లేదా తమ న్యాయవాది ద్వారా సంబంధిత కోర్టు పరిధిలోని మండల లీగల్ సర్వీసెస్ కమిటీలను లేదా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చని సూచించారు.

ఇక సమరమే..!

- నేడు ఎన్నికల షెడ్యూల్ విడుదల
- ఇరు పార్టీల్లోనూ అభ్యర్థుల ఎంపిక దాదాపు పూర్తి
- పోలవరం, కైకలూరుపై వీడని సస్పెన్స్
- అభ్యర్థుల ఎంపికతో మారుతున్న రాజకీయ సమీకరణలు
- సిఎఎ పిడుగుతో టిడిపి కూటమికి ముస్లిములు దూరం
- వాలంటీర్లు ఎన్నికలకు దూరంగా ఉండాలన్న నిబంధనకు తిలోదకాలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎన్నికల సమరానికి వేళయ్యింది. శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు ఎన్నికల షెడ్యూల్ విడుదలకు కేంద్ర ఎన్నికల సంఘం సిద్ధమైంది. అందుకు సంబంధించిన సమాచారాన్ని ముందుగానే మీడియాకు తెలియజేసింది. 2019 ఎన్నికల్లో మార్చి పదో తేదీన ఎన్నికల షెడ్యూల్ రాగా ఈసారి ఆరు రోజులు ఆలస్యంగా విడుదలవుతోంది. షెడ్యూల్ విడుదల తర్వాత పరిణామాలు మరింత వేగంగా మారే అవకాశం కనిపిస్తోంది. సుమారు నెల రోజులపాటు ఎన్నికల కురుక్షేత్రం సాగనుంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 14 అసెంబ్లీ, రెండు ఎంపీ స్థానాలు ఉన్నాయి. వైసిపి ఒంటరిగా పోటీ చేస్తుండగా టిడిపి, జనసేన, బిజెపి పొత్తుతో ఎన్నికల బరిలో తలపడనున్నాయి. ఇప్పటికే వైసిపి 14 అసెంబ్లీ, రెండు ఎంపీ స్థానాల అభ్యర్థులను ప్రకటించింది. అయినప్పటికీ తాడేపల్లిగూడెం, ఉండి స్థానాల్లో మార్పులు ఉండే అవకాశం ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. టిడిపి ఉండి నియోజకవర్గ నేత, మాజీ ఎంఎల్ఎ వేటుకూరి శివరామరాజు వైసిపిలోకి వెళ్తున్నట్లు ప్రచారం సాగుతోంది. అదే జరిగితే వైసిపి తరపున ఉండి నియోజకవర్గంలో శివరామరాజు పోటీకి దిగనున్నట్లు చర్చ నడుస్తోంది. తాడేపల్లిగూడెం స్థానంలోనూ మార్పులపై చర్చ సాగుతోంది. ఇక్కడ మాజీ ఎంఎల్ఎ ఈలి నాని వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. తాడేపల్లిగూడెం నుంచి వైసిపి తరపున ఈలి నాని పోటీ చేసే అవకాశం ఉందని చెబుతున్నారు. దీంతో వైసిపి ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించినప్పటికీ ఈ రెండు చోట్ల మార్పులు జరిగే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. టిడిపి, జనసేన, బిజెపి కూటమికి సంబంధించిన స్థానాల కేటాయింపుపై కొంత స్పష్టత వచ్చింది. మొత్తం 14 స్థానాల్లో ఎనిమిది చోట్ల తణుకు, ఏలూరు, ఉండి, పాలకొల్లు, ఆచంట, చింతలపూడి, నూజివీడు, దెందులూరు స్థానాల్లో టిడిపి అభ్యర్థులు బరిలో ఉన్నారు. మరో ఐదు స్థానాల్లో నరసాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం, ఉంగుటూరు, పోలవరంలో జనసేన అభ్యర్థులు, కైకలూరు నుంచి బిజెపి అభ్యర్థి పోటీ చేయనున్నట్లు స్పష్టత వచ్చింది. 12 స్థానాల్లో టిడిపి, జనసేన అభ్యర్థులు ఖరారవ్వగా పోలవరంలో బరిలో ఉండే అభ్యర్థిపై జనసేన ఇంకా తేల్చలేదు. కైకలూరు నుంచి బిజెపి అభ్యర్థి ఎవరు పోటీ చేస్తారనే దానిపైనా స్పష్టత లేని పరిస్థితి నెలకొంది. ఎంపీ అభ్యర్థుల విషయంలో వైసిపి కొంత స్పష్టతతో ఉంది. నరసాపురం ఎంపీ స్థానానికి గూడూరి ఉమాబాల, ఏలూరు ఎంపీ స్థానానికి కారుమూరి సునీల్‌కుమార్ పేర్లను వైసిపి ప్రకటించింది. మార్పులు, చేర్పులు ఉండే అవకాశం లేదని చెబుతున్నారు. నరసాపురం ఎంపీ టిక్కెట్ బిజెపికి, ఏలూరు స్థానం నుంచి టిడిపి పోటీ చేస్తుందని ప్రచారం సాగుతున్నప్పటికీ స్పష్టత లేకుండాపోయింది. నర్సాపురం నుంచి బిజెపి తరపున ప్రస్తుత ఎంపీ కనుమూరి రఘురామకృష్ణంరాజు, ఏలూరు నుంచి టిడిపి తరపున యనమల రామకృష్ణుడు అల్లుడు మహేష్ యాదవ్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. అభ్యర్థి ఎంపికపై టిడిపి నిర్వహిస్తున్న ఐవిఆర్ఎస్ కాల్స్‌లోనూ ఇదే పేరు ప్రస్తావించిన పరిస్థితి ఉంది. ఎంపీ అభ్యర్థులపై మరో రెండు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం కన్పిస్తోంది.

అసంతృప్తులతో రాజకీయ వేడి

పార్టీలవారీగా అభ్యర్థుల ఎంపిక పూర్తవ్వడంతో రాజకీయ సమీకరణలు వేగంగా మారుతున్నాయి. అసంతృప్తులు ఎక్కడా రాజీపడని పరిస్థితి నెలకొంది. ఉండి మాజీ ఎంఎల్ఎ శివరామరాజు టిడిపి అధిష్టానంపై ధిక్కార స్వరం వినిపిస్తూనే ఉన్నారు. ఈ ఎన్నికల్లో కచ్చితంగా పోటీ చేస్తానంటూ చెప్పిన పరిస్థితి ఉంది. ఒకవేళ వైసిపి టిక్కెట్ ఇవ్వకపోయినా ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తారా అనే అనుమానాలు నెలకొన్నాయి. ఏలూరులో జనసేన టిక్కెట్ ఆశించిన రెడ్డి అప్పలనాయుడు ఇంకా అలక వీడలేదు. ఇండిపెండెంట్‌గా పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. చింతలపూడిలో వైసిపి ఎంఎల్ఎ ఎలిజాకు టిక్కెట్ రాకపోవడంతో తీవ్ర అసంతృప్తితో విమర్శలు గుప్పిస్తూనే ఉన్నారు. ఉంగుటూరు, తాడేపల్లిగూడెం, తణుకులో గొడవలు సద్దుమణిగినట్లు కనిపిస్తూనే పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పలేమని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. తాడేపల్లిగూడెం, ఉండిలో వైసిపి అభ్యర్థులను మారిస్తే టిక్కెట్ ప్రకటించిన నాయకులు తిరుగుబాటు చేసే అవకాశం ఉంది. ఇప్పటి నుంచే గెలుపోటములపై ఎవరి అంచనాలు వారు వేస్తున్నారు. పోలవరంలోనూ చిర్రి బాలరాజును కాకుండా జనసేన వేరే అభ్యర్థిని ప్రకటిస్తే ధిక్కార స్వరం వినిపించే పరిస్థితి కనిపిస్తోంది.

సిఎఎతో టిడిపి కూటమికి ముస్లిములు దూరం

వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టాన్ని (సిఎఎ) కేంద్రం అమల్లోకి తేవడం టిడిపి కూటమికి ఎదురు దెబ్బగా చెప్పొచ్చు. ముస్లిములు ఈ చట్టంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో ముస్లిం ఓటర్లు టిడిపి కూటమికి వ్యతిరేకంగా వేసే నిలిచే పరిస్థితి కనిపిస్తోంది. ఏలూరు వంటి నియోజకవర్గంలో ఈ ఓటర్లు కొంత ప్రభావం చూపే అవకాశం ఉంది. మిగిలిన నియోజకవర్గాల్లో ముస్లిం ఓటర్లు తక్కువగా ఉన్నప్పటికీ కూటమికి వ్యతిరేకంగా ఓటు వేసే అవకాశం ఉంది.

ఎన్నికల పనుల్లో వాలంటీర్లు

వాలంటీర్లను ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని ఎన్నికల కమిషన్ ఆదేశించినప్పటికీ జిల్లాలో ఎక్కడా అమలు కావడం లేదు. అధికార పార్టీ అభ్యర్థులకు అండగా తాయిలాల పంపిణీ నుంచి అన్ని పనులు వారే చేస్తున్నారు. బూత్ ఏజెంట్లుగా సైతం వాలంటీర్లు ఉండేలా వైసిపి నాయకులు ప్రణాళిక రచిస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చిన తర్వాత పరిస్థితి ఏవిధంగా ఉంటుందో వేచిచూడాలి.

సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

పది పరీక్షల నిర్వహణకు చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

ఈ నెల 18వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జరగనున్న పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా, పారద ర్శకంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సంబంధిత అధికారులను ఆదేశిం చారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశ మందిరంలో వివిధ శాఖల సిబ్బందితో పదో తరగతి పరీక్షల నిర్వహణపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో పదో తరగతి పరీక్షలకు మొత్తం 32,355 మంది విద్యార్థులు హాజరు కానున్నారని, వీరిలో బాలురు 16,760, బాలికలు 15,595 మంది ఉన్నారని తెలిపారు. వీరిలో రెగ్యులర్ విద్యార్థులు 24,125 మంది అని, ప్రయివేటు విద్యార్థులు 8,230 మంది హాజరవుతున్నట్లు చెప్పారు. జిల్లాలో 139 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారని తెలిపారు. విద్యార్థులను 8.45కే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారన్నారు. ఆలస్యంగా వచ్చిన వారిని కేంద్రంలోకి అనుమతించేది లేదని స్పష్టం చేశారు. అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండి ఎటువంటి పొరపాట్లు దొర్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. జిల్లాలో 139 పరీక్షా కేంద్రాలను ముందుగానే ఒకసారి తనిఖీ చేయాలని సూచిస్తూ, ఏమైనా లోటుపాట్లు ఉంటే ముందుగానే చక్కదిద్దాలన్నారు. పరీక్షా కేంద్రాలకు మొబైల్ ఫోన్ల వంటి ఎలక్ట్రానిక్ గాడ్జెట్లను అనుమతించడం జరగదని స్పష్టం చేశారు. పరీక్షల నిర్వహణలో ఎటువంటి అక్రమాలకూ చోటులేకుండా ఈసారి ప్రతి ప్రశ్నాపత్రానికి ఒక క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేశారన్నారు. పరీక్షా కేంద్రాలన్నీ నో మొబైల్ జోన్లుగా ప్రకటించామని తెలిపారు. డిఇఒ సహా చీఫ్ సూపరింటెండెంట్, ఇతర అధికారులు సైతం పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, పేజర్లు, కాలిక్యులేటర్లు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావడానికి వీల్లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. పరీక్షల్లో అక్రమాలకు పాల్పడితే దానికి బాధ్యులైన వారికి మూడేళ్ల వరకు జైలుశిక్ష పడుతుందని హెచ్చరించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని కలెక్టర్ చెప్పారు. మాస్ కాపీయింగ్ నిరోధానికి ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశామన్నారు. సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. అక్కడ సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారన్నారు. సమావేశంలో ఎఆర్ ఎఎస్‌పి ఎన్ఎస్ఎస్.శేఖర్, డిఇఒ ఎస్.అబ్రహాం, డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.శర్మిష్ఠ, డిటిసి శాంత కుమారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ముక్కంటి, విద్యుత్ శాఖ ఎస్ఇ సాల్మన్‌రాజు, కలెక్టరేట్ ఎఒ కె.కాశీవిశ్వేశ్వరరావు, జిల్లా ప్రజా రవాణా అధికారి వరప్రసాదరావు, జెడ్‌పి డిప్యూటీ సిఇఒ ఎస్.నిర్మలాజ్యోతి, అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లావ్యాప్తంగా జరిగిన ఇంటర్ రాత పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఏలూరు జిల్లా పరీక్షల కమిటీ కన్వీనర్ బి.ప్రభాకర్‌రావు తెలిపారు. జిల్లాలో 51 కేంద్రాల్లో జరిగిన ద్వితీయ సంవత్సరం కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలకు మొత్తం 13,637 మందికిగాను 12,950 మంది హాజరయ్యారు. 687 మంది గైర్హాజరయ్యారు. వీరిలో సాధారణ విద్యార్థులు 12,364 మందికి 11,958 మంది హాజరవ్వగా 406 మంది గైర్హాజరయ్యారు. వృత్తి విద్యావిభాగంలో 1,273 మందికి 992 మంది హాజరవ్వగా 281 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 95 శాతం హాజరు నమోదైంది. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, మెయిన్ పరీక్షలు పూర్తయ్యాయని, బ్రిడ్జి కోర్స్ పరీక్షలు ఈ నెల 16, 18 తేదీల్లో 12 సెంటర్లలో జరుగుతాయని ప్రభాకర్‌రావు తెలిపారు.

అక్రమ బదిలీలు ఆపాలని యుటిఎఫ్ ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ధర్నాలో నినదిస్తున్న యుటిఎఫ్ నేతలు

ఉపాధ్యాయుల అక్రమ బదిలీలను వ్యతిరేకిస్తూ యుటిఎఫ్ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా శుక్రవారం ఏలూరు డిఇఒ కార్యాలయం వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఉపాధ్యాయులు పోరాటాల ద్వారా సాధించుకున్న కౌన్సెలింగ్ విధానాన్ని అపహాస్యం చేస్తూ ప్రభుత్వమే దొడ్డిదారి సిఫార్సు బదిలీలు చేయడానికి తీవ్రంగా ఖండిస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఈ ధర్నా నిర్వహించారు. పరీక్షలు జరుగుతున్న సమయంలో ఈ విధంగా సిఫార్సు బదిలీలు చేయడం వల్ల విద్యార్థులకు న్యాయమైన విద్య లభిస్తుందా అని ఈ సందర్భంగా నాయకులు ప్రశ్నించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ ముస్తఫాలీ, రుద్రాక్ష రవికుమార్ మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు హిందీ, తెలుగు పండితుల ప్రమోషన్లు, వివిధ జిల్లాల్లో పెండింగులో ఉన్న ప్రమోషన్లు ఇవ్వడానికి నిబంధనలు ఆటంకంగా ఉన్నాయని అధికారులు చెబుతున్న స్థితిలో సిఫార్సు బదిలీలు ఎలా సాధ్యమయ్యాయని ప్రశ్నించారు. ఉపాధ్యాయుల కోరిక మేరకే బదిలీలు చేస్తున్నామన్న ప్రభుత్వం అదే ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు వద్దని చెబుతున్న జిఒ 117 మరియు అప్రెంటీస్ విధానాన్ని ఎందుకు రద్దు చేయడం లేదన్నారు. నిబంధన ప్రకారం జరిగే కౌన్సెలింగ్ విధానానికి తూట్లు పొడిచి ప్రభుత్వ సిఫార్సు బదిలీలు వెంటనే రద్దు చేయాలని, లేకుంటే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఆరు నెలల్లో ఉద్యోగ విరమణ చేస్తున్న వారికి, శారీరక అంగవైకల్యం, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు ఎన్నికల విధులు కేటాయించొద్దని డిఇఒను కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి, పూర్వపు రాష్ట్ర కార్యదర్శి పివి.నరసింహారావు, జిల్లా కోశాధికారి జివి.రంగమోహన్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ బి.మోహన్‌రావు, జిల్లా కార్యదర్శి సుధారాణి, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఆనందం ఆవిరి

నీట మునిగి ఇంటర్ విద్యార్థి దుర్మరణం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

కొంగువారిగూడెంలోని కరాటం జలాశయంలో నీట మునిగి ఇంటర్ సెకండియర్ విద్యార్థి మృతి చెందిన ఘటన శుక్రవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పుట్లగట్లగూడెం గ్రామానికి చెందిన లింగిశెట్టి మహేంద్ర (17) శుక్రవారం ఇంటర్ సెకండియర్ పరీక్ష రాశాడు. పరీక్షలు పూర్తి కావడంతో సరదాగా స్నేహితులైన మరో ఐదుగురు విద్యార్థులతో కలిసి కొంగువారిగూడెం జలాశయం వద్దకు చేరుకున్నారు. అనంతరం స్నానం చేసేందుకు కుడికాల్వలోకి దిగారు. ఈ క్రమంలో లింగిశెట్టి మహేంద్రకు ఈత రాకపోవడంతో నీట మునిగాడు. ఇది గమనించిన తోటి విద్యార్థులు స్థానికులతో కలిసి అతికష్టంపై మహేంద్రను గట్టుపైకి తీసుకొచ్చి హుటాహుటీన జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మహేంద్ర అప్పటికి మరణించినట్లు తెలిపారు. లక్కవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన పెరగాలి

జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి

ప్రజాశక్తి - ఏలూరు

వినియోగదారుల హక్కులను రక్షించేందుకు నిర్దేశించిన బలమైన, స్పష్టమైన చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించే బాధ్యత నేటి యువతరంపై ఉందని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి అన్నారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి ఆర్ఎస్ఎస్.రాజు శుక్రవారం స్థానిక సిఆర్.రెడ్డి డిగ్రీ కళాశాల ఆడియో విజువల్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వినియోగదారుల హక్కుల గురించి స్పష్టంగా తెలుసుకుంటే మోసాలు చిన్నవైనా, పెద్దవైనా సరైన న్యాయం పొందటానికి అవకాశం దక్కుతుందన్నారు. సమాజంలో ప్రతి వినియోగదారుడు తమ హక్కులతోపాటు బాధ్యతలు తెలుసుకోవాలన్నారు. వినియోగదారుల రక్షణ చట్టం పటిష్టంగా అమలు కావడంపై అవగాహన కల్పిస్తామన్నారు. కాన్ ఫెడరేషన్ ఆఫ్ ఏలూరు డిస్ట్రిక్ట్ కన్జ్యూమర్ అసోసియేషన్స్ జిల్లా ప్రెసిడెంట్ కట్టా సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ రామానుజాచార్యులు, జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ సభ్యురాలు నాగలక్ష్మి, డాక్టర్ విజయ్‌కృష్ణ తదితరులు మాట్లాడారు. జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణిని వినియోగదారుల ఫోరం సభ్యులు సన్మానించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ అతిథులను సత్కరించారు.

జెసిని సత్కరిస్తున్న ప్రముఖులు

గ్రూప్-1 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ఈ నెల 17న నిర్వహించే ఎపి పిఎస్‌సి గ్రూప్-1 పరీక్షకు 4372 మంది హాజరు కానున్నారని గ్రూప్-1 జిల్లా సమన్వయ అధికారి, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో గౌతమి సమావేశ మందిరంలో ఎపిపిఎస్‌సి గ్రూప్-1 పోస్టుల భర్తీకి నిర్వహిస్తున్న పరీక్షకు నియమించిన చీఫ్ సూపరింటెండెంట్, లైజన్ ఆఫీసర్లు, రూటు ఆఫీసర్లు సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఈ పరీక్షల నిర్వహణకు ఐదు సెంటర్లు ఏర్పాటు చేశామని, ఐదుగురు లైజన్ ఆఫీసర్లను నియమించామని చెప్పారు. సిఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కాలేజీకి జిల్లా పశు సంవర్థక శాఖ జెడి డాక్టర్ జి.నెహ్రూబాబు, సిఆర్‌రెడ్డి బాలికల డిగ్రీ కళాశాలకు సెట్‌వెల్ సిఇఒ హెచ్.మెహర్‌రాజ్, సిఆర్‌ఆర్ పాలిటెక్నిక్‌కు జిల్లా ఉపాధి అధికారి సి.మధుసూదన్‌రావు, రామచంద్ర ఇంజినీరింగ్ కాలేజీకి ఎపి జిఎల్ఐ డిప్యూటీ డైరెక్టర్ కె.శ్రీనివాస్ వరప్రసాద్, సిహెచ్ఎస్‌డిఎస్‌టి థెరిస్సా మహిళా డిగ్రీ కాలేజీకి జిల్లా మత్స్యశాఖ అధికారి కెఎస్‌వి.నాగలింగేశ్వరరావును లైజన్ ఆఫీసరుగా నియమించినట్లు తెలిపారు. ఈ పరీక్షలు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం రెండు గంటల నుండి నాలుగు గంటల వరకు జరుగుతాయని చెప్పారు. అభ్యర్థులు తమ హాల్‌టికెట్, ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు ఒరిజినల్‌తో పరీక్షకు గంట ముందే కేంద్రానికి చేరుకోవాలని, పరీక్షా సమయం దాటాక ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని చెప్పారు. మాల్ ప్రాక్టీస్‌కు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించాలన్నారు. కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్ సరఫరాకు సమస్యలు లేకుండా చూడాలన్నారు. పరీక్షలకు సంబంధించి కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తారన్నారు. సమావేశంలో ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలీ, డిఎంహెచ్ఒ డాక్టర్ శర్మిష్ఠ, ఎపిపిఎస్‌సి సెక్షన్ ఆఫీసర్లు జి.అశోక్, ఎం.విజయకుమార్, పరీక్ష చీఫ్ సూపరింటెండెంట్లు కె.వెంకటేశ్వరరావు, ఎస్.అనురాధ, ఎ.శివకుమార్, కె.శ్రీరాములు, ఎ.పద్మావతి, కలెక్టరేట్ ఎఒ కాశీవిశ్వేశ్వరరావు, రూట్ ఆఫీసర్లు, సంబంధిత ఆర్‌టిసి, పోలీస్, ఎలక్ట్రికల్, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమ్మె కాలపు వేతన జిఒ విడుదలపై హర్షం

ఏలూరు అర్బన్: అంగన్వాడీలు ఇటీవల చేసిన 42 రోజుల సమ్మె కాలానికి వేతనాలు ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం జిఒ 12 జారీ చేయడం పట్ల ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.విజయలక్ష్మి, అధ్యక్షులు పి.సుజాత, కార్యదర్శి పి.భారతి, కోశాధికారి టి.మాణిక్యం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఇతర ఆరు సమస్యల పరిష్కారానికి సబ్ కమిటీ ఏర్పాటు చేస్తూ జిఒ నెం.10 జారీ చేయడంపై ధన్యవాదాలు తెలిపారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తామని ఇచ్చిన హామీ వెంటనే అమలు చేయాలని కోరారు. సర్వీస్‌లో ఉండి చనిపోయిన అంగన్వాడీలకు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.20 వేలు, బీమా అమలు కోసం, రిటైర్‌మెంట్ బెనిఫిట్ వర్కర్‌కు లక్ష నుండి రూ.1.2 లక్షలకు పెంపు, హెల్పరుకు రూ.40 వేల నుండి రూ.60 వేలకు పెంచుతూ వెంటనే జిఒలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సమ్మె సందర్భంగా అంగన్వాడీలపై పెట్టిన కేసులు రద్దు చేయాలని కోరారు.

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు

ఎంప్లాయీస్ గ్రీవెన్స్‌లో 14 అర్జీలు స్వీకరణ

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

ప్రభుత్వోద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆయన జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణితో కలిసి ఉద్యోగుల గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల ఉద్యోగుల నుండి విజ్ఞాపనలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగులకు ఉన్న సర్వీస్ సమస్యల పరిష్కారమైతే వారు మరింత స్వేచ్ఛాయుత వాతావరణంలో పని చేయగలుగుతారన్నారు. సర్వీసు మేటర్స్, పెన్షన్ సమస్యలు, ఆర్థికపరమైన అంశాలు, క్రమశిక్షణ కేసులు తదితర సమస్యలపై విజ్ఞాపనలను ఉద్యోగుల గ్రీవెన్స్‌లో అందజేసి సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. దీనిపై జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి ఆయా శాఖల ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఉద్యోగుల గ్రీవెన్స్‌లో 14 దరఖాస్తులను స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఎఒ కె.కాశీవిశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాలరాజు గెలుపునకు సమిష్టిగా కృషి చేయాలి

టిడిపి పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొరగం శ్రీనివాస్

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

అభివాదం చేస్తున్న టిడిపి, జనసేన నేతలు

జనసేన అభ్యర్థి చిర్రి బాలరాజు గెలుపునకు సమిష్టిగా కృషి చేయాలని టిడిపి పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొరగం శ్రీనివాస్ అన్నారు. పోలవరం నియోజకవర్గ స్థాయి సమన్వయ కమిటీ అత్యవసర సమావేశం స్థానిక శ్రీ వెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో బొరగం శ్రీనివాస్ మాట్లాడుతూ పొత్తులో భాగంగా పోలవరం సీటు జనసేనకు కేటాయించారని తెలిపారు. టిడిపి, జనసేన కార్యకర్తలు అందరూ జనసేన అభ్యర్థి చిర్రి బాలరాజును గెలిపించి అధినేతలకు బహుమతిగా అందించాలని కోరారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిర్రి బాలరాజు మాట్లాడుతూ టిడిపి, జనసేన కూటమితో ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. పోలవరం అభ్యర్థిపై వచ్చే తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. జనసేన ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి నేతలు, జనసేన నేతలు పాల్గొన్నారు.

పిఠాపురం నుంచి పవన్ పోటీకి మద్దతు : జోగయ్య

ప్రజాశక్తి - పాలకొల్లు

ఇటీవల జనసేన సీట్లను 21కి కుదించడంతో, జనసైన్యం మనస్తాపానికి గురైన విషయాన్ని పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లగా కొందరు తనను తీవ్రంగా విమర్శించారని కాపుసేన వ్యవస్థాపకులు చేగొండి హరిరామ జోగయ్య చెప్పారు. తాను పవన్‌కళ్యాణ్ ఎప్పటికైనా సిఎం కావాలని కోరుకునే వ్యక్తినని దీనికనుగుణంగా పని చేస్తానని జోగయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనసైన్యం ఆవేశాన్ని చల్లార్చడానికి ఇటీవల కాపుసేన కమిటీలను రద్దు చేశానని, త్వరలో వీటిని పునరుద్ధరిస్తానని చెప్పారు. పవన్‌కళ్యాణ్‌ను కాకినాడ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేయించాలని కొందరు కుట్రపన్నినా ఆయన పిఠాపురం నుంచి పోటీ చేయాలనే నిర్ణయానికి తన పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. తన కుమారుడు చేగొండి సూర్యప్రకాష్ జనసేనకు రాజీనామా చేసి వైసిపిలో చేరడం ఆయన వ్యక్తిగత విషయమని, తనకు ఏ విధమైన సంబంధమూ లేదని మరోసారి స్పష్టం చేశారు. జనసేన విజయానికి జన సైన్యం కషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

జిఒ 513, 630 రద్దు చేయాలి : ఐలు

ప్రజాశక్తి - భీమడోలు

ఎపి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో పాటు జిఒ 513, 630 రద్దు చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఐలు) భీమడోలు శాఖ తీర్మానించింది. భీమడోలు జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్ పరిధిలోని న్యాయవాదులు ఐలు ఆధ్వర్యంలో కోర్టు ఆవరణలో శుక్రవారం సమావేశమయ్యారు. కార్యక్రమానికి ఐలు పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు వి.శైలజ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమానికి పి.రాజారావు అధ్యక్షత వహించారు. అనంతరం శాఖ నూతన కార్యవర్గ ఎన్నికలను నిర్వహించారు. దీనిలో భాగంగా అధ్యక్షులుగా పి.రాజారావు, ఉపాధ్యక్షులుగా టి.విజన్, ప్రధాన కార్యదర్శిగా పి.బాలాజీ, సంయుక్త కార్యదర్శిగా జి.సంజయ్ బాబు, కోశాధికారిగా పి.శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులుగా జి.వి.ప్రసాద బాబు, కాళి నాగేశ్వరరావు, బి.వి.నారాయణ, ఒ.ప్రసాదరావు, ఈదా వెంకటరత్నం, ఆల్లాడ గంగాధర రావు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. నూతన కార్యవర్గాన్ని పలువురు న్యాయవాదులు అభినందించారు.

ఐలు భీమడోలు శాఖ నూతన కార్యవర్గం

మెరుగైన వైద్య సేవలందిస్తాం : డిసిహెచ్‌ఎస్

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - చింతలపూడి

రోగులకు మెరుగైన వైద్యం అందేవిధంగా కృషి చేస్తామని, దానికి తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా డిసిహెచ్‌ఎస్ డాక్టర్ పాల్ సతీష్ తెలిపారు. శుక్రవారం ప్రజాశక్తి పత్రికలో వచ్చిన 'ఏలీలు పెట్టేస్... యాప్రాన్, స్తెతస్కోప్ పెట్టుకొని పని చేస్తాం' అనే శీర్షికకు జిల్లా డిసిహెచ్‌ఎస్ డాక్టర్ పాల్ సతీష్ స్పందించి చింతలపూడి ప్రభుత్వ ఏరియా కమ్యూనిటీ హాస్పిటల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్పటల్ సిబ్బంది, వైద్యుల తీరుపై జిల్లా కలెక్టర్‌కి నివేదిక సమర్పిస్తామని, తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. చింతలపూడిలో నిర్మాణంలో ఉన్న 100 పడకల హాస్పిటల్ త్వరగా పూర్తిచేసి, సిబ్బందిని పెంచి, ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయం అందజేస్తామన్నారు. చింతలపూడి ప్రభుత్వ హాస్పటల్‌కు గైనకాలజిస్ట్‌ను వేస్తున్నామని తెలియజేశారు.

మోటార్ సైకిళ్లపై యువకుల హల్‌చల్..

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ముగియడంతో పరీక్షకేంద్రాల వద్ద అనేక మంది యువకులు బుల్లెట్, ఇతర వాహనాలపై మితిమీరిన వేగంతో ప్రయాణిస్తూ హల్‌చల్ చేశారు. ఒక్కో వాహనంపై ముగ్గురు, నలుగురు ప్రయాణిస్తూ భారీ సౌండ్స్ చేస్తూ పరీక్షల కేంద్రాల వద్ద హడావిడి సృష్టించారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పరీక్షలు రాసి బయటకు వచ్చిన విద్యార్థినీల పట్ల పోకిరి వేషాలు వేస్తూ భయభ్రాంతులకు గురిచేసే విధంగా ప్రవర్తించడం పట్ల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పోలీసులు పూర్తి చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

తడికలపూడిలో కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన

ప్రజాశక్తి - కామవరపుకోట

మండలంలోని తడికలపూడి గ్రామంలో ఎంపీ నిధులతో నిర్మాణం చేస్తున్న కమ్యూనిటీ హాల్‌కు జెడ్‌పిటిసి కడిమి రమేష్ శంకుస్థాపన, భూమి పూజ చేసి పనులు ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం రూ.10 లక్షల నిధులు సమకూర్చిన ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ బాబుకి ధన్యవాదాలు తెలిపారు. త్వరలోనే ఈ నిర్మాణం పూర్తి చేసి ప్రజలకి అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తడికలపూడి సర్పంచి కొత్తపల్లి రజని శ్రీనివాస్, ముళ్ళపూడి నాగరాజు, మేరుగు నాగరాజు, కల్లూరి గంగాధరరావు పాల్గొన్నారు.

'సొంగా రోషన్‌ను గెలిపించాలి'

ప్రజాశక్తి - చింతలపూడి

టిడిపి, జనసేన అభ్యర్థి సొంగా రోషన్ కుమార్‌ని అఖండ మెజార్టీతో గెలిపించాలని జిల్లా సాధికార కమిటీ అధ్యక్షులు కొప్పెర్ల నాగరాజు అన్నారు. చింతలపూడి మండల రాఘవపురం గ్రామంలో చింతలపూడి టిడిపి, జనసేన అభ్యర్థి సొంగా రోషన్ కుమార్‌ని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ రాష్ట్ర నాయి బ్రాహ్మణ సాధికార కమిటీ అధ్యక్షులు వైద్యం శాంతారామ్ ఆదేశాల మేరకు బిసి భరోసా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు పార్లమెంట్ సభ్యులు ద్రాక్ష వరపువెంకట గంగాధర్ రావు, చింతలపూడి సాధికార కమిటీ అధ్యక్షులు నందిగం సుబ్బారావు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం

ప్రజాశక్తి - కామవరపుకోట

చింతలపూడి అసెంబ్లీ నియోజకవర్గ టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థి సొంగ రోషన్ కుమార్ తడికలపూడి, వీరిశెట్టిగూడెం, ఆడమిల్లి గ్రామంలో శుక్రవారం పర్యటించారు. టిడిపి మ్యానిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాల గురించి గ్రామంలో ప్రచారం చేశారు. ఈ పర్యటనలో చింతలపూడి మాజీ ఎంఎల్‌ఎ ఘంటా మురళీరామకృష్ణ, మాజీ ఎఎంసి ఛైర్మన్ కోనేరు సుబ్బారావు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిని ప్రజలకు వివరించాలి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత ఆయా గ్రామాలలో జరిగిన అభివృద్ధిని, ప్రజలకు అందించిన సంక్షేమాన్ని ప్రతి గడపకు వెళ్లి వివరించాలని ఎంఎల్‌ఎ కొఠారు అబ్బయ్య చౌదరి తెలిపారు. మండలంలోని కొవ్వలి, పోతునూరు, గోపన్నపాలెం గ్రామాలకు చెందిన వైసిపి ముఖ్య నాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు.

బాల్య వివాహం చేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - ఏలూరు

బాల్య వివాహాలు నేరమని, బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా బాలల సంరక్షణ అధికారి డాక్టర్ సిహెచ్.సూర్య చక్రవేణి తెలిపారు. పెదవేగి మండలం కొప్పాక గ్రామానికి చెందిన మైనర్ బాలికకు బలవతంగా బాల్య వివాహం చేస్తున్నారనే సమాచారం మేరకు ఐసిడిఎస్ సిబ్బంది, పంచాయతీ, రెవెన్యూ అధికారులు, సచివాలయం మహిళా కార్యదర్శి బాలిక ఇంటికి వెళ్లి బాలికకు, తల్లికి బాల్య వివాహం వల్ల కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించారు. అలాగే బాలికకు కౌన్సెల్లింగ్ నిమిత్తం జిల్లా బాలల సంరక్షణ యూనిట్ కార్యాలయానికి తీసుకుని రాగా, జిల్లా బాలల సంరక్షణ అధికారి డాక్టర్ సిహెచ్.సూర్య చక్రవేణి ఆధ్వర్యం 'బాల్య వివాహల వల్ల కలిగే నష్టాల' గురించి, బాల్య వివాహ నిరోధక చట్టం-2006 ప్రకారం తీసుకునే చట్టపరమైన చర్యల గురించి అవగాహన కల్పించారు.

నేరాలు - ఘోరాలు

39 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని బొర్రంపాలెంలో రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ డి.దుర్గా మహేశ్వరావు శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బొర్రంపాలెం గ్రామానికి చెందిన జూలూరి కరుణకుమార్, కామన శ్రీనివాసరావులు ప్రజల వద్ద నుంచి పిడిఎస్ బియ్యం అక్రమ మార్గంలో సేకరించి, వాటిని అధిక ధరకు విక్రయిస్తున్నారనే సమాచారంతో డిప్యూటీ తహశీల్దార్ గుగులోతు ఉదయ భాస్కర్, విజిలెన్స్ అధికారులు గుర్తించి, వారిని పట్టుకుని, వారి వద్ద నుంచి 39 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం స్వాధీన పరుచుకున్నారు. డిటి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పేకాట రాయుళ్లు అరెస్ట్

ప్రజాశక్తి - ముసునూరు

పేకాటదారులపై ఉక్కుపాదం మోపుతున్నట్లు ముసునూరు ఎస్ఐ పి.వాసు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గోపవరం గ్రామంలో ఇద్దరు వ్యక్తులు రహస్య ప్రదేశంలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు ఎస్ఐ పి.వాసు తమ సిబ్బందితో కలిసి దాడి చేసి వారి వద్ద నుంచి రూ.1030 నగదు, ఇరువురిపై కేసు నమోదు చేశారు. అదేవిధంగా ముసునూరు మండలంలోని రమణక్కపేట గ్రామంలో రహస్య ప్రదేశంలో నలుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకుని, వారిపై కూడా దాడి చేసి, వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1130 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలియజేశారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

'పది' పరీక్షలకు సర్వం సిద్ధం

మండలంలో ఆరు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు

ఎంఇఒ పిడుగు ప్రభాకర బాబు

ప్రజాశక్తి - కలిదిండి

ఈనెల 18వ తేదీ నుంచి జరగనున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంఇఒ పిడుగు ప్రభాకర బాబు తెలిపారు. మండలంలోని ఆరు పరీక్షా కేంద్రాల ఏర్పాటు జరిగిందన్నారు. కలిదిండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కోరుకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, భాస్కరరావు పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆరుతెగ పాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కోరుకొల్లు క్రాంతి హై స్కూల్, కలిదిండి శశి హై స్కూల్‌లో పరీక్షలు జరుగుతాయన్నారు. ఆరు పరీక్షా కేంద్రాలలో రెగ్యులర్ విద్యార్థులు 715 మంది ఉన్నారన్నారు. వీరిలో బాలురు 351, బాలికలు 364, ప్రయివేటు విద్యార్థులు 308 కాగా బాలురు 187, బాలికలు 121, మొత్తం 1023 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావల్సి ఉందని తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా పరీక్షా కేంద్రాలలో తాగునీటితో పాటు గాలి, వెలుతురు, విద్యుత్, టాయిలెట్స్ వంటి సౌకర్యాలు ఉండేలా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. మొత్తం 65 మంది ఇన్విజిలేటర్లతో జరిగే పరీక్షలకు సెల్ ఫోన్స్, ఎటువంటి ఎలక్ట్రికల్ పరికరాలకు అనుమతి లేదన్నారు. పరీక్షలు ప్రారంభ రోజు నుంచి 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్షా కేంద్రం సమీపంలో జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచాలన్నారు. ఈ ఏడాది నుంచి ప్రతీ పరీక్షా పత్రంపై బార్ కోడింగ్ అమలులోకి వచ్చిందన్నారు. దీనివల్ల పరీక్షా పత్రం బయటకు వచ్చినా, ఏ సెంటర్ నుంచి ఏ రూం నుంచి బైటకు వచ్చిందో తెలుస్తుందన్నారు. విద్యార్థులు పరీక్షా సమయం కంటే 30 నిమిషాల ముందుగా పరీక్షా కేంద్రంలో ఉండాలన్నారు. ఎపిఎస్‌ఆర్‌టిసి కల్పించే ఉచిత ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు సమయ పాలన పాటిస్తూ, ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా పరీక్షలకు హాజరు కావాలని ఎంఇఒ ప్రభాకర బాబు తెలియజేశారు.

పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న ఎంఇఒ

అడ్డగోలు తవ్వకాలతో పైప్‌లైన్ ధ్వంసం

పంచాయతీకి తీవ్ర నష్టం : సర్పంచి కైకమ్మ

ప్రజాశక్తి - ముదినేపల్లి

గత 18 నెలలుగా కాంట్రాక్టర్ సెంటర్‌లో చేస్తున్న డ్రయినేజీ నిర్మాణ పనుల కారణంగా గ్రామపంచాయతీ ఏర్పాటు చేసిన పైపులైన్లు అన్నీ ధ్వంసమై పంచాయతీకి తీవ్ర నష్టం వాటిల్లుతుందని సర్పంచి కైకమ్మ అన్నారు. రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ముదినేపల్లి ప్రధాన సెంటర్‌లో డ్రయినేజీ నిర్మాణ పనులను కాంట్రాక్టర్ అడ్డగోలుగా చేపడుతున్నారు. ఈ కారణంగా గ్రామపంచాయతీ ఏర్పాటుచేసిన మంచినీటి పైపులైన్లు ధ్వంసం అవుతున్నాయి. దీంతో పైప్‌లైన్ ద్వారా కుళాయిలకు వచ్చే నీరంతా వృధాగా పోతూ రోడ్లపై ప్రవహిస్తుంది. కాంట్రాక్టర్ పంచాయతీ అధికారులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా, నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా ప్రొక్లైన్‌లతో పోలీస్ స్టేషన్ వద్ద గ్రామ ప్రధాన రహదారిని తవ్వేశాడు. ఈ కారణంగా మంచినీటి పైపులైను ధ్వంసం అయ్యి నీరంతా వృధాగా పోతుంది. ఈ విషయమై సర్పంచి కైకమ్మ మాట్లాడుతూ అసంపూర్తిగా, అడ్డదిడ్డంగా, ముక్కలు, ముక్కలుగా డ్రయినేజీ నిర్మాణ పనులు చేయటం కారణంగా పంచాయతీ పైపులైన్ ధ్వంసం, పైపులు లీకేజీలు కావటంతో పంచాయతీ నిధులతో మరమ్మతులు చేస్తున్నామన్నారు. అయినప్పటికీ కాంట్రాక్టర్, నేషనల్ హైవే అధికారులు ఏమాత్రం సర్పంచి సూచనలు గాని, సలహాలు తీసుకోకుండా వారి ఇష్టారాజ్యంగా డ్రయినేజీ నిర్మాణ పనులు చేస్తున్నారని తెలిపారు. నిర్మాణ పనులు చేసే సమయంలో మంచినీటి పైప్‌లైన్‌లకు లీకేజీ ఏర్పడడం కారణంగా మురుగు నీరు అంతా పైపుల ద్వారా కుళాయిల్లోకి వస్తుందన్నారు. దీంతో గ్రామస్తులంతా కుళాయిలు ద్వారా వచ్చే నీరు బాగోలేదని, మురుగునీరు వస్తుందంటూ అధికారులకు, పంచాయతీకి ఫిర్యాదులు చేస్తున్నట్లు తెలిపారు. కాంట్రాక్టర్ చేసే నిర్లక్ష్య పనులు కారణంగా గ్రామ పంచాయతీకి చెడ్డ పేరు వస్తుందని సర్పంచి ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కాంట్రాక్టర్, నేషనల్ హైవే అధికారులు స్పందించి పోలీస్ స్టేషన్ వద్ద ధ్వంసమైన పైపులైన్లను వెంటనే ఏర్పాటు చేసిన తర్వాతే డ్రయినేజీ నిర్మాణ పనులు కొనసాగించాలని, లేకుంటే డ్రయినేజీ నిర్మాణ పనులు జరగకుండా అడ్డుకుంటామని సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ తెలియజేశారు.

పైప్‌లైన్ ధ్వంసమైన గుంతలో నిలిచిన నీరు

సిఎం ఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పేదలకు వైద్య చికిత్స నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన సిఎం ఆర్‌ఎఫ్ చెక్కులను ఎంఎల్‌ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన 35 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.18.50 లక్షలకు సంబంధించిన చెక్కులను అందించినట్లు తెలిపారు. జగన్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడుతుందని, వచ్చే ఎన్నికల్లో మరలా జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధే వైసిపి లక్ష్యం

కలిదిండి : గ్రామాలాభివృద్ధే వైసిపి లక్ష్యంగా కృషి చేస్తోందని కైకలూరు నియోజకవర్గ ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని గుర్వాయిపాలెంలో రూ.9 లక్షల నిధులతో నిర్మాణం పూర్తైన మైక్రో వాటర్ ఫిల్టర్ పైపులైనును, రూ.1.30 కోట్ల నాడు-నేడు నిధులతో నిర్మాణం పూర్తయిన అదనపు తరగతి గదులను ఆయన ప్రారంభించారు. నూతనంగా మంజూరైన 80 రిజిస్ట్రేషన్ ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎంపిపి చందన ఉమామహేశ్వరరావు, జెడ్‌పిటిసి బొర్రా సత్యవతి, కైకలూరు నియోజకవర్గ వైసిపి నాయకులు పాల్గొన్నారు.

'రాష్ట్రాన్ని తాకట్టు పెట్టిన టిడిపి, జనసేన, వైసిపి'

ప్రజాశక్తి - నిడమర్రు

రాష్ట్రాల హక్కులను హరిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీలు సొంత ప్రయోజనాల కోసం పోటీపడి మద్దతు ఇవ్వడం రాష్ట్ర హక్కులు, ప్రయోజనాలు, విభజన హామీలు తాకట్టు పెట్టడమేనని సిపిఎం మండల కన్వీనర్ నారపల్లి రమణారావు తెలిపారు. నిడమర్రు ప్రజాసంఘాల కార్యాలయంలో సిపిఎం మండల కార్యకర్తల సమావేశం కోన శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ ప్రత్యేకవాద వ్యవసాయం, విద్యుత్తు, విశాఖ ఉక్కు, పోలవరం ప్రాజెక్టు, విభజన హామీలను బిజెపికి తాకట్టు పెడుతున్న టిడిపి, జనసేన, వైసిపి పార్టీలకు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. 2014 నుంచి 2018 వరకు టిడిపి, జనసేన మతతత్వ బిజెపి పొత్తుతో రాష్ట్రానికి ఏ అభివృద్ధి, ప్రయోజనం జరగలేదన్నారు. రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్న పార్టీలకు గుణపాఠం చెప్పాలని తెలియజేశారు. ఈ సమావేశంలో గవర సత్యనారాయణ, కానూరు రాజు, వెలగలేటి మోహన్, లావేటి సోంబాబు, మింది బాబు రాజు, లావేటి చందరరావు పాల్గొని మాట్లాడారు.

ప్రజలకు భరోసా కల్పించేందుకే 'ఫ్లాగ్‌మార్చ్'

చింతలపూడి: ప్రజలకు రక్షణ భరోసా కల్పించేందుకే ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నట్లు చింతలపూడి సిఐ సుధాకర్ తెలిపారు. చింతలపూడి పట్టణంలోని పలు ప్రాంతాలలో కేంద్ర సాయుధ బలగాలతో పోలీసుల కవాతు నిర్వహించారు. ప్రజలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి ఎస్ఐ కుటుంబరావు, సిబ్బంది పాల్గొన్నారు.

'డిఎన్ఆర్‌ను ఆశీర్వదించాలి'

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని ఉటుకూరు, వి.రావిగుంట గ్రామాలలో శుక్రవారం డిఎన్ఆర్ కోడలు స్వాతి ఇంటింటా తిరిగి సార్వత్రిక ఎన్నికల ప్రచారం చేశారు. మరోమారు డిఎన్ఆర్‌ను ఆశీర్వదించాలని మహిళలను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ ప్రచారంలో ఆమె వెంట మండల, గ్రామ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : మద్దిపాటి

ద్వారకాతిరుమల: నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల ఆశీస్సులతోనే తనకు ఎంఎల్‌ఎ సీటు వచ్చిందని, అందరికీ అందుబాటులో ఉండి అందరి సమస్యలు తీర్చేందుకు కృషి చేస్తానని కూటమి అభ్యర్థి మద్దిపాటి వెంకటరాజు అన్నారు. మోడీ, పవన్ కళ్యాణ్, చంద్రబాబు నాయుడు కలిసి త్రిమూర్తులు తనను గోపాలపురం నియోజకవర్గం ఉమ్మడి అభ్యర్థిగా, సామాన్యుడిగా పంపారని, ప్రజలందరూ ఆశీర్వదించి అసెంబ్లీకి పంపాలని మద్దిపాటి వెంకటరాజు కోరారు. ఆయన శుక్రవారం పోలసానిపల్లి ఫ్లైఓవర్ నుంచి టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలతో ర్యాలీగా ద్వారకాతిరుమల విచ్చేశారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం పాదాల మీదుగా స్వామివారి ఆలయానికి చేరుకున్నారు.

ఊటుకూరులో రీసర్వే ప్రక్రియ పూర్తి

గ్రామ సర్వేయర్ బోయిన నాగఫణీంద్ర

ప్రజాశక్తి - ముదినేపల్లి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష ప్రక్రియలో భాగంగా ముదినేపల్లి మండలం ఉటుకూరు గ్రామంలో రీసర్వే ప్రక్రియ పూర్తి అయిందని ఉటుకూరు గ్రామ సర్వేయర్ బోయిన నాగ ఫణీంద్ర శుక్రవారం తెలిపారు. పొలాల్లో సర్వే రాళ్ళు పాతి రీసర్వే ప్రక్రియ పూర్తి అయిందన్నారు. ఒకే నెంబర్ ఆధారంగా గ్రామంలో మొత్తం భూమి ఒక నెంబరు కిందకి తీసుకురావాలన్నది ప్రభుత్వం లక్ష్యమన్నారు. తొలుత డ్రోన్ కెమెరాల ద్వారా భూమి భౌగోళికంగా అంచనా వేసారు. ఆ అంచనాలకు సంబంధించి కెమెరా చిత్రాలను ప్రింటింగ్ వేయించి, వాటి ద్వారా కొలతలను సరి చేశారు. ఈ మొత్తం ఒక ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ఆధారంగా ఈ ఆన్‌లైన్‌ను రిజిస్ట్రేషన్ శాఖకు అనుసంధానం చేయడంతో ఖచ్చితమైన భూమి కనిపిస్తోందన్నారు. ఇప్పటికే ఈప్రక్రియ ఊటుకూరు గ్రామంలో పూర్తయ్యిందని తెలియజేశారు.

ఊటుకూరులో రీసర్వే చేస్తున్న సర్వేయర్

ఉపాధి హామీ బకాయిలు చెల్లించాలి : వ్యకాస

జంగారెడ్డిగూడెం టౌన్ : జిల్లాలో ఉపాధి హామీ బకాయిలు రూ.5 కోట్ల వరకు ఉన్నాయని, తక్షణమే ఆ వేతనాలు విడుదల చేసి కూలీలకు అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి, జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కమిటీ సభ్యురాలు టి.ముత్యాలమ్మ అధ్యక్షత వహించగా ఎ.రవి, జీవరత్నం మాట్లాడుతూ ఇప్పటికే జిల్లాలోని కూలీలందరూ చేసిన వేతన బకాయిలు రాక ఆకలితో అలమటిస్తున్నారన్నారు. అప్పుచేసి జీవనం సాగిస్తున్నారని వాపోయారు. ఉపాధి హామీ కూలీల వద్దకు పర్యటన నిమిత్తం వెళ్లి మాట్లాడగా వారి సమస్యలు పెద్ద సంఖ్యలో ఉన్నాయని, ప్రధానంగా కూలీలు చేసిన పనికి పే స్లిప్పులు ఇవ్వటంలో అధికారులు విఫలమయ్యారని మండిపడ్డారు. జిల్లాలోని ఉపాధి హామీ చట్టాన్ని ప్రతిష్ఠంగా అమలు చేస్తామన్న అధికారుల మాటలు మాటలకే పరితమయ్యాయని, తక్షణమే కూలీలకు గత, ఈ సంవత్సర బకాయిలు కూడా చెల్లించాలని పేర్కొన్నారు. ఈ కొత్త సంవత్సరంలో అడిగిన వారందరికీ పనులు కల్పించి, జాబ్ కార్డులు ఇచ్చి, ఎండలు పెరుగుతున్నందున మజ్జిగ, మంచినీళ్లు, మెడికల్ కిట్లు, చలువ పందిళ్లు, సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలని కోరారు. ఈ సమస్యలన్నింటిపైన జిల్లా పీడీ దృష్టి సారించి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని తెలియజేశారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు వై.నాగేంద్రరావు, టి.సత్యనారాయణ, అందుగుల ప్రభాకర్ రావు పాల్గొన్నారు.

వస్తు కొనుగోలులో రశీదు తీసుకోవాలి

కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గుత్తా గిరిబాబు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రతిఒక్క వినియోగదారుడు వస్తు, సేవలను కొనుగోలు చేసేటప్పుడు రసీదు తీసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గుత్తా గిరిబాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మధ్యాహ్నం కళాశాల ఆర్థికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గుత్తా గిరిబాబు అధ్యక్షత వహించి మాట్లాడుతూ తమ హక్కులను, బాధ్యతలను గుర్తించాలని తెలిపారు. అనంతరం అర్థశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ ఎం.రాంబాబు మాట్లాడుతూ వివిధ రకాల వినియోగదారుల ఫోరంలు, అవి వినియోగదారులకు కల్పించే రక్షణలను గూర్చి వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధ్యాపకులు ఎస్.పరమేశ, టివిఎస్ పద్మావతి, ఎం.కృష్ణచైతన్య, పిఆర్.కావ్యశ్రీ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు టెంట్ ఏర్పాటు : ఎపిఒ

ప్రజాశక్తి - ముసునూరు

ఉపాధిహామీ కూలీలకు టెంట్ సదుపాయం సమకూర్చినట్లు ఎపిఒ టి.రోజ్‌లీలా అన్నారు. శుక్రవారం మండలంలోని గోపవరం గ్రామ పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న ఉపాధిహామీ కూలీలకు పనిచేసిన అనంతరం కొంత సమయం ఎండలో లేకుండా వుండేందుకుగాను టెంట్ సమకూర్చినట్లు, పని ప్రదేశంలో ప్రమాదవశాత్తు ఎవరికైనా గాయమైనా ప్రథమ చికిత్స చేసుకునేందుగాను, ఫస్ట్ ఎయిడ్ కిట్, మంచినీరు సదుపాయం కల్పిస్తున్నామన్నారు. శుక్రవారం నుంచి ఈ సంవత్సరంలో మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టం జరిగే మార్చి, ఏప్రియల్, మే, జూన్, జూలై, ఆగష్టు నెలలో జరిగే మండలంలోని 16 గ్రామాల్లో ప్రతిరోజుపైన ఏర్పాటు చేసిన సకల సదుపాయాలు కల్పించనున్నట్లు ఆమె తెలియజేశారు. ఎవరైనా మేట్ లేదా ఫిల్డ్ అసిస్టెంట్ ఈనెల నుంచి ఆగష్టు వరకు పని దినాలు ఏర్పాటు చేయకపోతే వారిపై కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆమె హెచ్చరించారు.

సీసీ రోడ్లు ప్రారంభం

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లిలోని అంబేద్కర్ కాలనీలో నూతనంగా నిర్మించిన అంతర్గత సీసీరోడ్లను శుక్రవారం గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. గురజలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాన్ని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి వెంకటేశ్వరమ్మ, హౌసింగ్ బోర్డు డైరెక్టర్ గంటా సంధ్య, పార్టీ మండల అధ్యక్షులు మొట్రూ ఏసుబాబు, వైస్ ఎంపిపి రాచురి రాధ పాల్గొన్నారు.

BHIMAVARAM MUNICIPALITY

EXPRESSION OF INTEREST

Roc.No. 1905/2023-F2, Dated.14-03-2024

The BHIMAVARAM MUNICIPALITY has decided to hire an agency, where the agency collects the chicken waste from all chicken shops in Bhimavaram Municipality, transport it to their safe disposal facility. In this regard, the BHIMAVARAM MUNICIPALITY invites private sector parties/ agencies either individually or in consortium to submit non-binding Expressions of Interest (EOI) with regard to the proposed work.

Interested bidders can obtain EOI document from Public Health Department, Bhimavaram Municipality office and submit their proposals in office tender box tender bids from 16-03-2024 at 11.30 AM onwards.

1. Last date / time of submission of tenders: 23-03-2024 at 2.00 PM.
2. Date / time of opening of tenders: 23-03-2024, 3.00 PM
4. For Further details Contact: Commissioner, Bhimavaram Municipality, A.P.
   Email: apusp3@rediffmail.com, Phone No. 08816-234284.

Sd/- COMMISSIONER
BHIMAVARAM MUNICIPALITY

ముగిసిన ఇంటర్ పరీక్షలు

కలిదిండి: ఇంటర్ ద్వితీయ సంవత్సర కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షకు 87 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎగ్జామినేషన్ చీఫ్ సూపరెండెంట్ నంబూరి గోపాల కృష్ణంరాజు తెలిపారు. మండలంలోని కోరుకొల్లు, కలిదిండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన పరీక్షకు 96 మంది హాజరు కావల్సి ఉండగా 87 మంది హాజరయ్యారన్నారు. తొమ్మిది మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. నేటితో ఇంటర్ పరీక్షలు ముగిసినట్లు ఆయన తెలియజేశారు.

అన్ని పార్టీల ఫ్లెక్సీలు తొలగించాలి : ఆర్‌డిఒ

జంగారెడ్డిగూడెం టౌన్ : జంగారెడ్డిగూడెంలోని ఆర్‌డిఒ కార్యాలయంలో అన్ని పార్టీల నాయకులకు ఆర్‌డిఒ అద్దయ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో అన్ని పార్టీల నాయకులకు పలు సూచనలు చేశారు. పట్నంలో ఉన్నటువంటి అన్ని పార్టీలకు సంబంధించినటువంటి ఫ్లెక్సీలను తీసివేయాలని, నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలని, ఎక్కడా కూడా అనుమతి లేనిదే సమావేశాలు, పార్టీ మీటింగులు ఏర్పాటు చేయరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

కామవరపుకోట: పిల్లలకు పౌష్టికాహారం అందేవిధంగా చూడాలని జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ పద్మావతి తెలిపారు. పౌష్టికాహార పక్షోత్సవాల కార్యక్రమంలో భాగంగా మండలంలోని తడికలపూడి-2 అంగన్వాడీ కేంద్రంలో తల్లులకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పాల్గొన్న పద్మావతి మాట్లాడుతూ చిన్నారులకు ప్రతిరోజు పౌష్టికాహారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ బ్యూలా, ఎఒ మల్లిక పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్‌అదాలత్

ఏలూరు సిటీ: ఈనెల 16న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ అదాలత్‌లో పరిష్కారం నిమిత్తం 8,152 కేసులను రాజీయోగ్యమైనదిగా గుర్తించడం జరిగిందన్నారు. కావున కక్షిదారులు నేరుగా గాని, తమ న్యాయవాది ద్వారా గాని సంబంధిత కోర్టు పరిధిలోని మండల లీగల్ సర్వీసెస్ కమిటీలను సంప్రదించవచ్చని తెలియజేశారు.

పాస్‌పోర్టు పోయినది

ELUMARTHI LALITHA KUMARI అను నాకు విశాఖపట్నం పాస్‌పోర్టు కార్యాలయం అధికారులు ది.05-10-2018న S5307368 నెంబరు గల పాస్‌పోర్టు మంజూరుచేసారు. సదరు పాస్‌పోర్టు జిరాక్స్ కాపీలు తీయించుకునేందుకు ది.04-03-2024న మా ఇంటి నుండి పాలకొల్లుటౌన్, మెయిన్‌రోడ్‌కు వెళ్తుండగా నా ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. గాన, నా పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు అందించగలరని కోరుతున్నాను.

ELUMARTHI LALITHA KUMARI
W/o. Elumarthi Balaji
D.No. 2-62, Chintaparru, Tallacheruvu Road
Palakol Mandal, W.G.Dt. A.P.

మహారాజశ్రీ 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో (ఎక్సైజ్ కోర్టు), ఏలూరు

O.S. No. 482/2022

బిట్వీన్:

వినుకొండ మణికుమారి మరియొకరు -వాదులు

మరియు

వినుకొండ రాజ్‌కుమార్ మరియు ఇతరులు -ప్రతివాదులు

To:

Defendant No-1: Vinukonda Raj Kumar, S/o. late Daniel, H/M. A.a. 49 yrs, Coolie, D.No. 2-163/402, 19th Ward, Khandrikagudem, Eluru Mandal, Eluru Dist., A.P.

Defendant No-2: Vinukonda Madhavi, W/o. Raj Kumar, H/F.m., A.a. 45 yrs, House wife, D.No. 2-163/402, 19th Ward, Khandrikagudem, Eluru Mandal, Eluru Dist., A.P.

Defendant No-3: Vinukonda Lavanya, D/o. Raj Kumar, H/F.M., A.a. 19 yrs, Vacant, D.No. 2-163/402, 19th Ward, Khandrikagudem, Eluru Mandal, Eluru Dist., A.P.

Defendant No-4: Vinukonda Jahnavi, D/o. Raj Kumar, H/F.M., A.a. 18 yrs, Sdudent, D.No. 2-163/402, 19th Ward, Khandrikagudem, Eluru Mandal, Eluru Dist., A.P.

పై నంబరు దావాలో ప్రతివాదులయిన మీరు కోర్టు వారు పంపిన నోటీసులు తీసుకోకుంఆడ కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం ది. **28-03-2024**వ తేదీకి వాయిదా వేసినారు. కావున ఆరోజు ఉదయం **10.30 ని॥లకు** మీరు శ్రీ పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

CH.DURGA POORNIMA
Advocate, Eluru, Cell: 7386441140

పబ్లిక్ నోటీసు

ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్

(ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సంస్థ యొక్క అనుబంధ సంస్థ)

రి.నెం. ABC-CS/006/2015

H.O. : ABCCS Endowments Commissionerate Complex, Gollapudi, Vijayawada-521 225. Phone: 0866-6650307 | B.O. : ABCCS , D.No.23B-5-96/1, R.R.Peta, ELURU-534 002, Ph: 08812-249787

ఈ ప్రకటనలోని వారి తాలూకు దిగువ ఉదహరించిన స్థిరాస్తిని సొసైటీ నందు తనఖా పెట్టి అప్పు పొందుటకు దరఖాస్తు చేసియున్నారు. సదరు స్థిరాస్థి తనఖాపై సొసైటీ వారు మంజూరు చేయబోవు అప్పు విషయమై ఎవరికైననూ ఎట్టి అభ్యంతరములు ఉన్న ఎడల ఈ ప్రకటన తేదీ నుండి 7 రోజుల లోపుగా లిఖితపూర్వకముగా అభ్యంతరములను రిజిస్టరు పోస్టు విత్ ఎక్‌నాలెడ్జ్‌మెంటు ద్వారా మా సొసైటీకి తెలియపర్చవలసినదిగా కోరుతున్నాము.

Sl.No.	Applicant Name & Present Residence Address	Description of the Property
1	Sri. NANDIRAJU RAHI KIRAN, GL No. 58016 S/o NANDIRAJU SUBBA RAO Cell. 8247034884 / 9642006354	THE PROPERTY IN AN EXTENT OF 236.0 SQ.YDS OF HOUSE SITE ALONG WITH RCC ROOFED GROUND FLOOR & PART RCC ROOFED FIRST FLOOR RESIDENTIAL BUILDING THEREIN, IN T.S.NO.144/P, PLOT NO.11(P) & 12, BLOCK NO.7, DOOR NO. 24C-10-11/12, REVENUE WARD NO.23, ASST NO. 1075027182, SANTHOSH NAGAR, R R PET, ELURU, WEST GODAVARI DISTRICT. **Value Rs. 86,75,000/-**
2	Smt GORITI SRI VANI, GL No. 69710 W/o TENNETI VENKATA SRINIVASA RAO Cell : 8341845848 / 8985695385	THE PROPERTY AN EXTENT OF UNDIVIDED AND UNSPECIFIED SITE OF 40 SQ. YARDS OF SITE OUT OF 3595.85 SQ. YARDS OF SITE ALONG WITH RCC ROOFED RESIDENTIAL APARTMENT BUILDING IN SANJANA ESTATESUNDER THE NAME AND STYLE OF "VENKATESWARA NILAYAM", GROUND FLOOR, FLAT NO: 103, WITH PLINTH AREA OF 1325 SFT IN R.S.NO. 362/1,2 & 362/1, OLD DOOR NO. 6-239, NEW DOOR NO. 6-537, ASST NO. 1559, GOLLALAKODERU (V&P), PALAKODERU (M), W.G.DIST.534202 **VALUE RS. 46,35,000 /-**

Eluru
Dt.15-03-2024

AKELLA SURYA BHASKARA RAO
Asst. Branch Manager
Cell: 9281029465, 9177734925